క్లుప్తంగా

యోగా పోటీల్లో విజేతలకు బహుమతులు



పొదలకూరు: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండలంలోని పులికల్లు గ్రామంలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి గురువారం సర్పంచ్ జి.వెంకటసుబ్బమ్మ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మాధవి, ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం జనార్దన్, గ్రామ పెద్దలు వై.పెంచలరెడ్డి, జి.నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేసీ ఆకస్మిక తనిఖీ



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న జేసీ కూర్మనాథ్

ఇందుకూరుపేట: మండలంలోని జగదేవిపేట సచివాలయాన్ని జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సచివాలయంలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం క్షేత్రస్థాయిలో భూ సర్వే ప్రక్రియను పరిశీలించారు. మండలంలో జరిగిన రీ సర్వేపై రెవెన్యూ సిబ్బందితో చర్చించారు. ఆయన వెంట తహసీల్దార్ సుబ్బయ్య, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ హనుమాన్ ప్రసాద్, సర్వేయర్ హరనాథ్, సర్వే డీటీ రవికుమార్, ఆర్ఐ జీవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని బుచ్చిరెడ్డిపాళెం, దామరమడుగులలో పలు బాధిత కుటుంబాలను కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గురువారం పరామర్శించారు. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కత్తి మహేష్ తండ్రి ఇటీవల మృతిచెందగా ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. అలాగే దామరమడుగులో వైఎస్సార్‌సీపీ నాయకుడు పొనకా భాస్కర్‌రెడ్డి తల్లి మృతిచెందగా వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. అలాగే పాలిచెర్ల వేణురెడ్డి తల్లి మృతిచెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహులు, మల్లి, వెంకయ్య, రజనీకాంత్, మోహన్, శ్రీను, పెంచలయ్య ఉన్నారు.

స్పోర్ట్స్ క్యాలెండర్ల ఆవిష్కరణ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ స్పోర్ట్స్ క్యాలెండర్లను అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ గురువారం ఆవిష్కరించారు. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ దేశంలోనే పేరు ప్రఖ్యాతలు సంపాదించిందని తెలిపారు. ఇండోనేసియాలో ఇటీవల నిర్వహించిన బ్యాడ్మింటన్ డబుల్స్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాయి సాత్విక్‌రాజ్, విరాక్ విజయం సాధించారని చెప్పారు.

ఈ ఏడాదిలో పోటీలు..

అండర్ – 17 బ్యాడ్మింటన్ పోటీలను జూలై 22 నుంచి 25 వరకు నగరంలో నిర్వహించనున్నామని ద్వారకానాథ్ చెప్పారు. అండర్ – 19 బ్యాడ్మింటన్ పోటీలను చిత్తూరు జిల్లాలో జూలై 28 నుంచి 31 వరకు నిర్వహించనున్నామని చెప్పారు. ఏపీ స్టేట్ సీనియర్ మెన్స్ అండ్ ఉమెన్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌ను ఆగస్ట్ మూడు నుంచి ఆరు వరకు నిర్వహించనున్నామని, ఇందులో సుమారు మూడు వేల మంది క్రీడాకారులు పాల్గొననున్నారని వివరించారు. సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ ఒకటి వరకు అండర్ – 15, 17 యోనెక్స్, సన్‌రైజ్ ఆలిండియా సబ్ జూనియర్స్ ర్యాంకింగ్ టోర్నీని నిర్వహించనున్నామని వెల్లడించారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల వీరవెంకటేశ్వర్లు, డీఎస్‌డీఓ యతిరాజ్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ నేతలు శ్రీకాంత్, రామ్మోహన్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలకు పరిష్కారం

నెల్లూరు(సెంట్రల్): రెవెన్యూ సమస్యల పరిష్కారానికి గానూ నగరంలోని 46వ డివిజన్లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించామని కార్పొరేటర్ వేలూరు మహేష్ పేర్కొన్నారు. ఆచారివీధిలోని క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సదస్సును నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు గురువారం నిర్వహించారు.

సంక్షేమ పథకాలతో ఆనందం

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి
- 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా 80 వేల గడపలకు వెళ్లిన ఎమ్మెల్యే



చిన్నారులకు ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రజల ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని 9, 10 వార్డుల్లో గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, ప్రభుత్వ పథకాల బుక్‌లెట్‌లను అందరికీ అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంట్లో వారికి లబ్ధి చేకూరిందని తెలిపారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లినప్పుడు ప్రజల ముఖాల్లో సంతోషం కనిపిస్తోందని, ఈ దఫా కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. అనంతరం హరివిల్లు ప్రాంతంలో ఉన్న పాఠశాలను ఎమ్మెల్యే పరిశీలించి 'జగనన్న గోరుముద్ద' పథకం అమలును పరిశీలించారు.

80 వేల గడపలు పూర్తి

'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా కోవూరు నియోజకవర్గంలోని 5 మండలాల్లో ఉన్న 68 సచివాలయాల పరిధిలో ఇప్పటివరకు 156 రోజులపాటు పర్యటించి సుమారు 80,200 గృహాలను సందర్శించి ప్రజలతో మమేకమైనట్లు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గతేడాది ఆగస్టులో ప్రారంభించామని, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, ప్రజల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తూ ముందుకుసాగుతున్నామని తెలిపారు.

భవితకు భరోసా

పలు బాధిత కుటుంబాల పిల్లలకు కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి అండగా నిలిచారు. పెనుబల్లికి చెందిన విద్యార్థి తాటితోటి యశ్విక, కావేటి భవ్యశ్రీ, పెనుబల్లికి చెందిన కలువాయి నరసింహ, కలువాయి కవిత, బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన షేక్ సమీనలకు ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్ ద్వారా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన రమణమ్మ అనే మహిళకు ఇస్త్రీ బండి నిర్వహించుకునేందుకు రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ లలితారెడ్డి, వైస్ చైర్మన్ షాహుల్, తహసీల్దార్ సుధీర్, కౌన్సిలర్ రహమత్, నాగరాజు, షకీలాబేగం, సత్యనారాయణ, యానాదిరెడ్డి, చీర్లప్రసాద్, అనంతమ్మ, మోర్ల జయంతి, శ్రీదేవి, ప్రమీలమ్మ, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, అల్లాభక్షు, చాందిని, ప్రవల్లిక, విల్సన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని అధికారులు, సచివాలయ ఉద్యోగులకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సూచించారు. స్థానిక నెల్లూరు రోడ్డులోని కల్యాణ మండపంలో గురువారం అధికారులు, సచివాలయ ఉద్యోగులు, స్థానిక ప్రజాప్రతినిధులతో పంచాయతీల వారీగా మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం నిధులను వెచ్చిస్తోందని, మరో మూడు నెలల్లో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని తెలిపారు. గ్రామాల్లో భూ సంబంధిత వివాదాలు తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో జరిగిన పనులకు సంబంధించిన నిధులు కూడా మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, పెదమల్లు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు



మాట్లాడుతున్న డీసీఎమ్మెస్ వీరి చలపతిరావు

కొడవలూరు: 'జగనన్న సురక్ష' కార్యక్రమం అమలుపై వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెంలో వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని సమస్యల పరిష్కార వేదికగా 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ఈ కార్యక్రమం ద్వారా అపరిష్కృతంగా ఉన్న ప్రతి సమస్యనూ పరిష్కరించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారని తెలిపారు. ఇందులో వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి జనన, మరణ, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, రేషన్‌కార్డు, కరెంటు బిల్లులో పేరు మార్పు, సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించాల్సి ఉంటుందన్నారు. జూలై మాసమంతా ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి అత్యంత ప్రాముఖ్యత ఉన్నందున ప్రతి ఇంటికీ వెళ్లి ఆ ఇంట్లోని వారు ఏఏ పథకాలకు అర్హులో గుర్తించి అవి అందేలా చూడాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, సర్పంచ్ బి.సుప్రియ, సచివాలయ కన్వీనర్ గంగపట్నం జనార్దన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జి.జాలయ్య పాల్గొన్నారు.

నేడు విడవలూరులో 'గడప గడపకు..'

కోవూరు(విడవలూరు): విడవలూరులోని సచివాలయం–2 పరిధిలో శుక్రవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

డిగ్రీ పరీక్షల్లో ఐదుగురు విద్యార్థుల డిబార్

వెంకటాచలం: విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలల్లో గురువారం నిర్వహించిన డిగ్రీ నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్షల్లో ఐదుగురు విద్యార్థులను డిబార్ చేశారని వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ తెలిపారు. ఉదయం నిర్వహించిన నాలుగో సెమిస్టర్ పరీక్షకు 1,187 మందికి గానూ 1,106 మంది హాజరయ్యారని, ఒకరిని డిబార్ చేసినట్లు వెల్లడించారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన ఆరో సెమిస్టర్ పరీక్షకు 1,260 మంది విద్యార్థులకు 1,174 మంది హాజరయ్యారని, నలుగురిని డిబార్ చేసినట్లు తెలిపారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

కోవూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–2024 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీపీ లక్ష్మీప్రసూన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఈ నెల 24వ తేదీ ఆఖరు అని, సైన్స్, ఆర్ట్స్, కామర్స్, కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో చేరే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

'జగనన్న సురక్ష' ద్వారా సర్టిఫికెట్లు

మనుబోలు: 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని, ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు గ్రామాల్లోనే అందజేస్తామని ఆర్ఐ శివప్రసాద్ తెలిపారు. మండలంలోని వీరంపల్లి గ్రామ సచివాలయంలో గురువారం 'జగనన్న సురక్ష'పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో భాగంగా 11 రకాల ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తామని తెలిపారు. ఇందుకోసం ఈ నెల 29న గ్రామంలో సర్వే నిర్వహిస్తామని తెలిపారు. ఎవరికి ఏ సర్టిఫికెట్లు అవసరమో తెలుసుకుని జూలై 6న సర్టిఫికెట్లను అందజేస్తామని తెలిపారు. సమావేశంలో ఏఎబీ చైర్మన్ జట్టి సురేందర్‌రెడ్డి, సర్పంచ్ సుధాకర్, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి పాల్గొన్నారు.

మురుగు కాలువ నిర్మాణం



పద్మావతినగర్‌లో నిర్మించిన మురుగు కాలువ

పొదలకూరు: పట్టణంలోని వినాయకస్వామ్యం, పద్మావతినగర్‌లో మురుగు కాలువల నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈ ప్రాంతాల్లో పర్యటించినప్పుడు మురుగు కాలువలు నిర్మించాలని ప్రజలు విజ్ఞప్తి చేయడంతో మంత్రి నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో మురుగు కాలువలను నిర్మిస్తుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్య

- సమగ్ర శిక్ష ఏపీసీ సీహెచ్ ఉషారాణి



గిరిజనకాలనీలో పర్యటిస్తున్న ఏపీసీ ఉషారాణి

కోవూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని సమగ్ర శిక్ష ఏపీసీ సీహెచ్ ఉషారాణి పేర్కొన్నారు. మండలంలోని పాటూరు గ్రామం పరిధిలో ఉన్న చెక్కిరాలదిబ్బ ప్రాంతంలోని గిరిజన ప్రాథమిక పాఠశాలను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె గత 8 సంవత్సరాలుగా వివిధ కారణాలతో అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పరిశీలించారు. ఆ పాఠశాలలో చిన్నారులు నేలపై కూర్చొని విద్యనభ్యసిస్తుండగా చూసిన ఆమె తక్షణమే ఈ పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని ఎంపీడీఓ శ్రీహరిని ఆదేశించారు. వెంటనే సమీప పాఠశాలలో మిగిలి ఉన్న బెంచీలను తీసుకువచ్చి గిరిజన పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పాటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల హాజరు నూరుశాతం ఉండాలన్నారు. డ్రాపౌట్స్ ఉంటే వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థులకు 'జగనన్న విద్యాకానుక' కిట్ల ద్వారా మూడు జతల యూనిఫాం, బ్యాగు, బెల్టు, బూట్లు, సాక్సులు, డిక్షనరీ, పలు రకాల పుస్తకాలు తదితర సామగ్రి అందించి అండగా నిలుస్తోందని తెలిపారు. ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. అలాగే 'జగనన్న గోరుముద్ద' పథకం అమలును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట ఐటీడీఏ ఏఓ శాంతకుమారి, పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు ఆలీ అహ్మద్, సీఆర్‌పీ శ్రీనివాసులు, వెల్ఫేర్ అసిస్టెంట్ అశోక్, హరిణి తదితరులు ఉన్నారు.

పశుబీమా పథకంపై అవగాహన



మాట్లాడుతున్న జేడీ మహేశ్వరుడు

కోవూరు: పశుబీమా పథకంపై రైతులు అవగాహన పెంచుకుని ఆర్థికంగా నష్టపోకుండా చూసుకోవాలని కోవూరు పశుసంవర్ధకశాఖ జేడీ మహేశ్వరుడు సూచించారు. స్థానిక పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో గురువారం కోవూరు, బుచ్చి, విడవలూరు, దగదర్తి, కొడవలూరు, మండలాల పరిధిలో ఉన్న పశువైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బంది, గోపాలమిత్రలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో 17,500 పశువులకు బీమా చేయాలని లక్ష్యంగా ఉందని, దానిని పూర్తి చేసేందుకు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఇప్పటి వరకు 7,500 పశువులకు బీమా సౌకర్యం కల్పించామన్నారు. కార్యక్రమంలో డీఏహెచ్ఓ డాక్టర్ సురేష్, డీడీలు రమేష్‌నాయక్, సోమయ్య, డాక్టర్ ఐ.కృష్ణమౌర్య, డాక్టర్ ప్రసన్నాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



నిత్యాన్నదానానికి నగదు అందజేస్తున్న దృశ్యం

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన శ్రీమల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గురువారం దాతలు రూ.లక్ష విరాళం అందజేశారు. దగదర్తి మండలం పెదపుత్తేడు గ్రామానికి చెందిన తుంగా పాండురంగారెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి కుటుంబసభ్యుల పేరిట గురువారం రూ.లక్ష నిత్యాన్నదానానికి అందజేసినట్లు ఆలయ పాలక మండలి చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈఓ వెంకటేశ్వర్లు, అర్చకులు పాల్గొన్నారు.

18 ఏళ్ల లోపు వారంతా బడిలో ఉండాలి



నార్తురాజుపాళెం హైస్కూల్ ప్లస్‌లో డిజిటల్ తరగతులు పరిశీలిస్తున్న డీఈఓ

- డీఈఓ ఎస్.గంగాభవాని

కొడవలూరు: పద్దెనిమిదేళ్లలోపు వయస్సు వారంతా బడిలోనే ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రాపౌట్స్‌గా ఉండరాదని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎస్.గంగాభవాని సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని సీఆర్‌పీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లతో గురువారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదిసప్లిమెంటరీలో కూడా ఫెయిలైనప్పటికీ మరలా పాఠశాలలో రెగ్యులర్ పద్ధతిలో చదివే వెసులుబాటును ఈ ఏడాది నుంచి ప్రభుత్వం కల్పించిందన్నారు. ఇంటర్మీడియట్ విషయంలోనూ ఇదే నిబంధనలు అమలవుతాయని తెలిపారు. పద్దెనిమిదేళ్లలోపు వయసున్న ఏ ఒక్కరూ బడి బయట ఉండకూడదన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ వెసులుబాటు కల్పించిందని తెలిపారు. పాఠశాలకు వచ్చే పిల్లల హాజరు వంద శాతం ఉండేలా చూడాలన్నారు. విద్యార్థి పాఠశాలకు గైర్హాజరైతే వెంటనే ఇంటికి వెళ్లి కారణం తెలుసుకుని క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకాన్ని 90 శాతానికి పైగా విద్యార్థులు సద్వినియోగం చేసుకొనేలా చూడాలన్నారు. పాఠశాలల గదులు, పరిసరాలతోపాటు మధ్యాహ్న భోజన నిర్వహణలోనూ పరిశుభ్రత పాటించాలని సూచించారు. నాడు–నేడు పనులను వేగవంతం చేయించి సకాలంలో పూర్తి చేసేలా చూడాలని ఆదేశించారు. అనంతరం నార్తురాజుపాళెం హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించి హెచ్ఎంకు పలు సూచనలిచ్చారు. ఇక్కడి హైస్కూల్ ప్లస్‌లోని డిజిటల్ బోర్డు ద్వారా బోధనను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డిజిటల్ బోధనకు సహకారమందించిన దాతలను ఆమె ప్రశంసించారు. సమావేశంలో ఎంఈఓ జి.వసంతకుమారి, ఎంఈఓ–2 ఎస్.అంకయ్య, హెచ్ఎం డి.ఓబులేసు, సీఆర్‌పీలు ఎం.దయాకర్, జె.పెంచలరావు, వీరాంజనేయులు, లీలయ్య, రమేష్, సురేష్, శ్రీహరి, సంక్షేమ సహాయకులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుదాం



మురుగు కాలువల్లో పూడిక తీస్తున్న సిబ్బంది

మనుబోలు: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహరించాలని పంచాయతీ విస్తరణాధికారి ప్రసాద్ కోరారు. కలెక్టర్ ఆదేశాలతో మండలంలోని గురివిందపూడి, మడమనూరు, చెరుకుమూడి గ్రామాల్లో గురువారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. రోడ్ల పక్కనున్న చెత్తను తొలగించి మురుగు కాలువల్లో పూడిక తీయించి బ్లీచింగ్ చల్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి మంగళ, గురు, శనివారాల్లో ఉదయం నుంచి గ్రామాల్లో చెత్త తొలగించే కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు ఉదయం నుంచి గ్రామాల్లో ఉంటూ పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు



రైతుల నుంచి అర్జీ స్వీకరిస్తున్న డీటీ బాలకోటమ్మ

మనుబోలు: రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని డిప్యూటీ తహసీల్దార్ బాలకోటమ్మ తెలిపారు. మండలంలోని గురివిందపూడి గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతుల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా వారి గ్రామాలకే వెళ్లి తెలుసుకుని పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు ఉపకరిస్తాయని తెలిపారు. ఆమె వెంట వీఆర్వో శ్రీనివాసులు ఉన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సెబ్ సీఐ బాలకృష్ణ

ఇందుకూరుపేట: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని, లేకుంటే భవిష్యత్ నాశనమవుతుందని సెబ్ సీఐ బాలకృష్ణ సూచించారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై అడిషనల్ ఎస్పీ డి.హిమవతి ఆదేశాల మేరకు మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను రవాణా చేయడం నేరమన్నారు. మాదక ద్రవ్యాల రవాణాపై సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 14500 నంబరకు కాల్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సెబ్ ఎస్సై మొగల్‌బాబు, ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



ఇందుకూరుపేట: మండలంలోని కొమరిక మజరా వారణాశివారికండ్రిగ ప్రాథమిక పాఠశాలలో నవోదయకు ఎంపికైన విద్యార్థులను ఎంఈఓ ఎంవీ సునీల్‌కుమార్ గురువారం అభినందించారు. ఆ పాఠశాల విద్యార్థులు బాలబొమ్మ ఆర్తిక, మారుబోయిన జయనందిని జవహర్ నవోదయలో 6వ తరగతిలో ప్రవేశానికి ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు టి.అరుణకుమారి, ఉపాధ్యాయుడు ఈటె ప్రసాద్, సీఆర్‌పీ బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.